క్లుప్తంగా

నగరంలో భారీ వర్షం



నెహ్రూనగర్: నగరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం దాకా ఎండ కాసినప్పటికీ సాయంత్రం 4 గంటల తరువాత నుంచి మబ్బులు కమ్ముకొచ్చి, రాత్రి 7 గంటల దాకా వర్షం కురిసింది. దీంతో నగరవాసులు, వీధి వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం వేళల్లో వర్షం కురియడంతో కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లే వారు, విద్యార్థులు అవస్థలు పడ్డారు. నగరంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి.

టెన్నిస్ రన్నరప్ తేజిత్‌కు అభినందనలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): విజయవాడలో ఈ నెల 20న జరిగిన ఏపీ స్టేట్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంటులో వై.తేజిత్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రన్నరప్‌గా నిలిచాడని కోచ్ జీవీఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శిక్షణ పొందిన తేజిత్‌ను సభ్యులు టి.వి.వి.ఎస్. సూర్యనారాయణరెడ్డి, జిల్లా టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్.సాంబశివరావు అభినందించారని పేర్కొన్నారు.

నేటి అథ్లెటిక్ పోటీలు వాయిదా

అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో జరగాల్సిన జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు వర్షాల కారణంగా తాత్కాలికంగా రద్దు చేశామని అసోసియేషన్ కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఏర్పాటు చేసే ఈ పోటీల తేదీలు ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ డే



లక్ష్మీపురం: అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ నాయకుడు తిరుపతయ్యను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో సీనియర్ సిటిజన్స్‌గా ఉండటమే నేరం అన్నట్లు ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో 14 కోట్లకు పైగా ఉన్న సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి తీసుకునే చర్యల్ని అన్ని రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో ప్రకటించాలని తిరుపతయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ టి.రత్నారావు, సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ నాయకులు ప్రసంగించారు.

ఎస్‌ఐ కుటుంబానికి చెక్కు పంపిణీ



నగరంపాలెం: జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన వి.వెంకట్రావు అనారోగ్యంతో ఈ ఏడాది ఫిబ్రవరి 16న మరణించారు. ఈ మేరకు వెంకట్రావు భార్య శ్రీదేవికి లక్ష రూపాయల కార్పస్ ఫండ్ చెక్కుని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరావు (ఏఆర్) పాల్గొన్నారు.

కార్మికురాలికి ఆర్థిక సాయం



నగరంపాలెం: కోకోకోలా ఫ్యాక్టరీలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికురాలు పి.రత్నకుమారి గత నెల 29న గాయపడింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం కుదుటపడింది. మానవతా దృక్పథంతో డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (గుంటూరు) శివకుమార్‌రెడ్డి స్పందించి, ఆర్థిక సాయం అందించారు. ఆయన స్ఫూర్తితో మంగళగిరి ఫైర్ అధికారి వెంకటేశ్వర్లు, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఫ్యాక్టరీలోని ఉద్యోగులు అందరూ కలసి రూ.30 వేలు సహాయం చేశారు. కార్మికులంతా తోటి వారికి సాయం చేయాలని, ప్రమాదాలు వాటిల్లకుండా యాజమాన్యం జాగ్రత్తలు తీసుకోవాలని శివకుమార్‌రెడ్డి తెలిపారు.

చెట్లు నరకడం పర్యావరణానికి 'గొడ్డలి'పెట్టు

- వాల్టా చట్టం కింద చర్యలు
- గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.2.04లక్షల జరిమానా వసూలు



బృందావన్ గార్డెన్స్‌లో నరికేసిన చెట్టు

నెహ్రూనగర్: పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషించేవి చెట్లు. అవి నేడు నగరంలో రకరకాల కారణాలతో నేలకొరుగుతున్నాయి. జగనన్న హరిత నగరంలో భాగంగా అధికారులు నగరంలో చెట్లను, గ్రీనరీ అభివృద్ధి చేసి సుందరీకరణకు చర్యలు తీసుకుంటుంటే మరోపక్క కొంతమంది బాధ్యతారహితంగా చెట్లు నరికేస్తున్నారు. ఇంటి ముందు ఉన్న చెట్ల ఆకులు రాలుతున్నాయని, కొమ్మలు ఇంటి మీదకు వాలిపోతున్నాయని, ఇంటి ముందు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి వంటి కారణాలతో చెట్లను విచక్షణారహితంగా తొలగిస్తున్నారు. పర్యావరణ సమతుల్యత, ప్రజారోగ్య రక్షణలో కీలకమైన చెట్లను కొందరు అనాలోచితంగా, స్వార్థ ప్రయోజనాల కోసం తొలగిస్తున్నారు. ఈ చర్యలు పర్యావరణానికి గొడ్డలిపెట్టుగా మారాయి. అనుమతి లేకుండా చెట్లు నరికినందుకు నగర పాలక సంస్థ అధికారులు గత సంవత్సరం జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.2.04లక్షలు అపరాధ రుసుం చేశారు. ఇకపై వాల్టా (వాటర్, లాండ్ అండ్ ట్రీస్ యాక్ట్) 2002 ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

చెట్ల వయస్సు బట్టి జరిమానా

చెట్ల వల్ల ప్రమాదభరితమైన, ఇబ్బందికర పరిస్థితుల ఉంటే ముందస్తుగా నగరపాలక సంస్థకు దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత అధికారులు పరిశీలించి, వాస్తవంగా ఇబ్బందికరంగా ఉంటే తొలగించడానికి అనుమతి ఇస్తారు. ఇవేమి లేకుండా నరికివేస్తే చెట్టు వయస్సును బట్టి రూ.4వేల నుంచి రూ.30వేల వరకు జరిమానా విధిస్తారు. ఇటీవల శ్యామలానగర్ బాలకుటీర్ రోడ్డులో చెట్టు నరికేసినట్లు ఫిర్యాదు అందడంతో అక్కడి వెళ్లిన నగరపాలక సంస్థ ఏడీహెచ్ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్) చెట్టు నరికిన వారికి చలానా కింద రూ.30వేలు వసూలు చేశారు. రాజేంద్రనగర్‌లో ఓ ఇంటి ముందు అడ్డుగా ఉన్న చెట్టును నరికేసినందుకు గాను సదరు వ్యక్తిపై రూ.25వేలు అపరాధ రుసుం కింద వసూలు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

పర్యావరణ పరిరక్షణ కోసం నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. కొంత మంది అనాలోచితంగా చెట్లు నరికేస్తూ పర్యావరణ పరిరక్షణకు హాని కలిగిస్తున్నారు. ఇప్పటికే నగరంలో చెట్లు నరికే వారిపై జరిమానా విధించాం. అవసరమైతే వాల్టా చట్టం కింద నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టేందుకు వెనకాడబోం. నగరంలో ఎక్కడైన చెట్లు నరికితే 9849908370 నంబర్‌కు తెలియజేయాలి.

– రామారావు, ఏడీహెచ్, నగరపాలక సంస్థ

జయహో చంద్రయాన్!

- నగర ప్రజల హర్షాతిరేకాలు
- విద్యార్థుల్లో మిన్నంటిన విజయోత్సాహం



పాటిబండ్ల సీతారామయ్య స్కూల్లో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



మాజేటి గురవయ్య హైస్కూలు విద్యార్థుల ప్రదర్శన



జాతీయ జెండాలతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు



వెంగళరావునగర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థుల వినూత్న ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: చంద్రయాన్-3 ప్రయోగ విజయవంతం కావడం ద్వారా భారతదేశం అంతరిక్ష ప్రయోగాల్లో అగ్రస్థానంలో నిలిచిందని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం చంద్రయాన్-3 ల్యాండింగ్ ప్రక్రియను ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఇస్రో శాస్త్రవేత్తలు గొప్ప విజయాన్ని సాధించారని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ దేశ గర్వించదగిన ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సుసాధ్యం చేశారని పేర్కొన్నారు. ప్రపంచంలో భారతదేశం గొప్ప శక్తిగా అవతరించబోతోందని చెప్పేందుకు ఇటువంటి విజయాలే తార్కాణమని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాది అని, ఇటువంటి ప్రయోగాలు వారిలో స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. ర్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

- చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ శాటిలైట్ విజయవంతంగా ల్యాండింగ్ కావడంపై నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ విద్యార్థులు చంద్రయాన్-3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ర్యాలీగా బయలుదేరిన విద్యార్థులు లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు వెళ్లారు. జయహో భారత్ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మట్టిగుంట శారదాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 విజయవంతంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 'ఆల్ ది బెస్ట్ టు విక్రమ్ ల్యాండర్' అంటూ అక్షర క్రమంలో కూర్చుని వినూత్నంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

భారత్‌కు అపురూపమైన విజయం

లక్ష్మీపురం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం భారత్‌కు అపురూపమైందని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

చరిత్ర సృష్టించిన భారత్



పట్నంబజారు: చంద్రయాన్ -3 విజయవంతం అవ్వడం సంతోషదాయకమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కొనియాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు.చంద్రయాన్-3 సక్సెస్ అవ్వడంతో ఇస్రో శాస్త్రవేత్తల కృషి ఫలించిందని తెలిపారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. భారతీయులుగా మనందరం గర్వపడేలా చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఇందుకు మూల కారణమైన శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం మన ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం తెలుగు వారిగా మనకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

చంద్రయాన్- 3 విజయం 140 కోట్ల మంది భారతీయుల విజయంగా పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల సత్తా భారతీయులందరికీ గర్వకారణమని తెలిపారు. అంతరిక్ష చరిత్రలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికారన్నారు. ఈ అపూర్వమైన సాహసం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి జరగడం తెలుగు వారందరికీ గర్వకారణమని చెప్పారు. చంద్రుడిపై 14 రోజుల పరిశోధన జరిపి అనేక కొత్త విషయాలను కనుగొంటారనే ఆశాభావం వ్యక్తం చేశారు. విశ్రాంత ఆర్టీసీ అధికారి వి.కె.డి. మల్లేశ్వరరావు, సంస్థ సభ్యులు మురళీకృష్ణ, జమదగ్ని ప్రసంగించారు.

బీజేపీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ

గుంటూరు మెడికల్: చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం విజయోత్సవ ర్యాలీని శంకర్ విలాస్ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వరకు నిర్వహించారు. నగర ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు పాల్గొన్నారు. ర్యాలీలో జిల్లా ప్రధాన కార్యదర్శులు రామమల్లు భాస్కర్, చరకకుమార్ గౌడ్, ఈదర శ్రీనివాస రెడ్డి, వనమా నరేంద్ర, వెలగలేటి గంగాధర్, పద్మనాభం, జితేంద్ర గుప్తా, పవన్, ప్రతాప్ ప్రసాద్, వరికూటి వీర సుధాకర్, రాజేష్ నాయుడు, నాగ సాయి, శేషగిరి, కామేపల్లి వెంకటేశ్వర్లు, లంకా రవి రామచంద్రరావు, సురేష్ జైన్, రమేష్, కారంశెట్టి సత్యం పాల్గొన్నారు.

కౌమార దశలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



విద్యార్థులకు శానిటరీ నాప్కిన్స్ అందజేస్తున్న డాక్టర్ రాజకుమారి, పక్కన డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు మెడికల్: విద్యార్థినులంతా కౌమార దశలో వచ్చే అనేక సమస్యలపై అవగాహన పెంచుకుని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి సూచించారు. స్థానిక రైలుపేటలోని కన్న స్కూలులో విద్యార్థినులకు బుధవారం కౌమార దశలో ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ కౌమార దశలో విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నట్లు వెల్లడించారు. చెడు అలవాట్లకు కూడా బానిసలవుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా కౌమార దశలో పలు రకాల ఇన్‌ఫెక్షన్లను దరి చేరనీయకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. రుతు స్రావం అనేది ప్రకృతి సిద్ధంగా జరిగే విధానమని, ఈ సమయాల్లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పక్షంలో కౌమార దశ పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని సూచించారు. అనంతరం విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ పంపిణీ చేశారు. ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్యులు శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ చదువుకునే వయస్సులో విద్యార్థులు ఉన్నత లక్ష్యాల్ని నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులంతా ఆరోగ్యకరమైన జీవనం గడిపేలా అహల్య ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కన్న విద్యా సంస్థల అధినేత కన్న మాస్టారు, సురేష్ జైన్ పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబ సభ్యుల సమస్యలకు పరిష్కారం



నగరంపాలెం: పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యుల సమస్యల్ని వెంటనే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ (డీపీవో) ఆవరణలో అమరవీరుల కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. సమస్యల్ని ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరరావు (ఏఆర్) పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: షాపుల్లో చోరీ కేసుల్లో నిందితుడ్ని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల అరండల్‌పేట పరిధిలోని రెండు షాపుల్లో చోరీ జరిగింది. విచారణ చేపట్టిన పోలీసులు బుధవారం తెలంగాణ రాష్ట్రానికి చెందిన దుద్దాడ లింగంను అరెస్టు చేసి రూ. 9వేలు స్వాధీనం చేసుకున్నారు.

జీజీహెచ్ అభివృద్ధికి దాతల సాయం అభినందనీయం



మినరల్ వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాయం అందించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. కృష్ణాజిల్లా తిరువూరుకు చెందిన సీహెచ్.రామకృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడి జూన్ 11న జీజీహెచ్ ఆర్థోపెడిక్ మూడో యూనిట్‌లో చేరారు. ప్రొఫెసర్ డాక్టర్ అద్దెపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్యులు ఆపరేషన్ చేశారు. కృతజ్ఞతగా రామకృష్ణ ఆర్థోపెడిక్ వైద్య విభాగానికి రూ. 80వేల విలువైన పరికరాలు అందజేశారు. ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆచంట శ్రీనివాస్ రూ. 5వేల విరాళం అందించారు.

వాటర్ కూలర్ బహూకరణ

గుంటూరు జీజీహెచ్‌లోని చిన్న పిల్లల వార్డు సమీపంలో మినరల్ వాటర్ కూలర్‌ను బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవ పున్నయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పట్టపు గోపి రూ. 50 వేల విలువైన కూలర్‌ను మూడుసార్లు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు.

ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పించిన మనోహర్, అధ్యాపకులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రకాశం పంతులు ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాలకులు కె. చిన్నప రెడ్డి, ఎన్. నాగిరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

- పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్. జయశైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నివాళి

లక్ష్మీపురం: భారతీయుడి ఆత్మగౌరవానికి, తెలుగు వాడి ఆత్మస్థైర్యానికి, ఆంధ్ర పౌరుషానికి నిలువెత్తు నిదర్శనం టంగుటూరి ప్రకాశం అని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్. మూర్తి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు జయంతిని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ అనుక్షణం ప్రజల కోసమే జీవించిన టంగుటూరి నూటికి నూరు శాతం ప్రజా నాయకుడుగా వెలుగొందిన ధీరోదాత్తుడు, త్యాగధనుడని కొనియాడారు. సీనియర్ సిటిజన్స్ నాయకులు ఎన్.తిరుపతయ్య మాట్లాడుతూ తెలుగు వారంత గర్వంగా ఆంధ్ర కేసరి అని పిలుచుకునే ప్రకాశం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సీనియర్ ఇంజనీర్ పి.ఘనశ్యామాచార్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు.

రేపటి వరకు నగరపాలక సంస్థలో ఈఎస్‌ఐ శిబిరం



శిబిరంలో వివరాలను నమోదు చేసుకుంటున్న కార్మికులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలోని అవుట్ సోర్సింగ్ కార్మికులంతా తప్పనిసరిగా ఈఎస్‌ఐ కార్డును నవీకరణ (అప్‌డేట్) చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఈఎస్‌ఐ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈఎస్‌ఐ నూతన నిబంధనల మేరకు కార్మికులంతా తప్పనిసరిగా ఈఎస్‌ఐ కార్డుల్ని కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులతో పాటు ఫ్యామిలీ ఫొటోతో అప్‌డేట్ చేసుకోవాలని తెలిపా రు. ఇప్పటికే డివిజన్ల వారీగా కార్మికులకు రోజు వారీ షెడ్యూల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల నుంచి ఆన్‌లైన్ చేయడానికి కంప్యూటర్ ఆపరేటర్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో ఆప్కాస్ జనరల్ మేనేజర్ నాగ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కళా విపంచి వార్షికోత్సవం



వడ్లమాని రవి దంపతులను సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికగా బుధవారం కళా విపంచి 17వ వార్షికోత్సవం, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సభకు ప్రముఖ గజల్ గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ సి. మానవేంద్రనాథ్‌రాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాతత్పరులు డాక్టర్ వడ్లమాని రవి, ఆదర్శ దంపతులకు ఆంధ్ర కేసరి విశిష్ట సేవా పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సోమయాజులు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా సేవాతత్పరులు వడ్లమాని రవికి పురస్కారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు బొప్పన నరసింహారావు పర్యవేక్షించారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, భాస్కర్‌రామ్, అట్లూరి నారాయణరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ, మల్లికార్జునరావు, జి.వి.జి. శంకర్, డి. తిరుమలేశ్వరరావు, కె.రామకృష్ణ ప్రసాద్, సయ్యద్ జానీ బాష పాల్గొన్నారు.

క్రైస్తవుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గం



నెహ్రూనగర్: క్రైస్తవుల ఐక్యతే సమస్యల పరిష్కారానికి మార్గమని సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరబాబు పిలుపునిచ్చారు.మణిపూర్ రాష్ట్రంలోనే కాకుండా ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల్లో మతోన్మాద శక్తులు విచ్చలవిడిగా చర్చిలపై దాడులు చేస్తూ క్రైస్తవుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. గుంటూరు రాజీవ్ గృహకల్ప కమ్యూనిటీ హాలులో బుధవారం ఉమ్మడి పౌర స్మృతి, మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై హత్యాకాండ, సెక్యులర్ రాజ్యాంగం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం విఫలమైందని, మతోన్మాద శక్తులు పెచ్చుమీరుతున్నాయని తెలిపారు. సదస్సుకు అధ్యక్షత వ్యవహరించిన జాకిన్ మినిస్ట్రీస్ పాస్టర్ పేరుపోగు సురేష్ జేమ్స్ మాట్లాడుతూ క్రైస్తవులపై దాడుల్ని సంఘటితంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సెప్టెంబర్ 19న నిర్వహించనున్న చలో గుంటూరు కలెక్టరేట్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేముల భారతి, లూథరన్ చర్చి పాస్టర్ నిరీక్షణరావు, ప్రేమ్ కుమార్, రజనీకాంత్, వివిధ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

పట్నంబజారు: యువతి వెంటపడి వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయిగూడెం మండలానికి చెందిన సంధ్య నాజ్ సెంటర్‌లోని డీమార్ట్‌లో పని చేస్తోంది. టెలిగ్రామ్ ద్వారా దుర్గాప్రసాద్ పరిచయమయ్యాడు. ఇద్దరూ కొద్దిరోజులు సన్నిహితంగా మెలిగారు. సంధ్యకు దుర్గాప్రసాద్ ప్రవర్తన నచ్చకపోవడంతో ఇటీవల దూరంగా ఉంటోంది. అయినప్పటికీ దుర్గాప్రసాద్ వెంటపడి ప్రేమించాలంటూ వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు బుధవారం పోలీసుల్ని ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.